బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గెలుపు ఖాయం

● మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

నర్సింహులపేట: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత గెలుపు ఖాయమని మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ముఖ్య కార్యకర్తలతో మాట్లాడారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు మైదం దేవేందర్, నాయకులు నెలకుర్తి సత్తిరెడ్డి, వంశీనాయక్, సీతారాంనాయక్, మిర్యాల వెంకన్న పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నీళ్లు ఇస్తే.. కాంగ్రెస్ కరువు ఇచ్చింది..

దంతాలపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతి గ్రామానికి నీళ్లు ఇస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం కరువు ఇచ్చిందని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఎద్దేవా చేశారు. సోమవారం మండలంలోని గున్నేపల్లి, రామానుజాపురం, కుమ్మరికుంట్ల, వేములపల్లి, దొనకొండ, రేపోని పలు గ్రామాల్లో రెడ్యానాయక్ ఎన్నికల విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ధర్మారపు వేణు, నాయకులు మల్లారెడ్డి, కిషోర్ పాల్గొన్నారు.

కవితను మెజార్టీతో గెలిపించాలి

కేసముద్రం: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవితను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఇంటింటా తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓ హోటల్‌లో పలువురికి టిఫిన్ అందిస్తూ, వినూత్న రీతిలో ప్రచారం చేశాడు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుగులోతు వీరునాయక్, ఎంపీపీ వోలం చంద్రమోహన్, బీఆర్ఎస్ నేత నీలం దుర్గేష్, పార్టీ మండల అధ్యక్షుడు ఎండి.నజీర్‌అహ్మద్, ప్రధాన కార్యదర్శి కముటం శ్రీనివాస్, కొంగ్రెడ్డి రవీందర్‌రెడ్డి, గుంజపాడుగు కొమ్మన్న పాల్గొన్నారు.



నర్సింహులపేట: పెద్దనాగారంలో మాట్లాడుతున్న రెడ్యానాయక్



కేసముద్రం: టిఫిన్ అందిస్తూ ఎన్నికల ప్రచారం చేస్తున్న శంకర్‌నాయక్

మరిపెడ రూరల్: మండలంలోని ఎడ్జెర్ల గ్రామంలో సోమవారం ఎంపీపీ గుగులోతు అరుణ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాలోతు కవితను గెలిపించాలని ఓటర్లను ఆమె అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు రాంబాబు, నాయకులు శ్రీను, వెంకన్న, రవి పాల్గొన్నారు.

బయ్యారం: మలోతు కవితను గెలిపించాలని కోరుతూ సోమవారం మండలంలోని పలు పంచాయతీల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గణేష్, సొసైటీ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు శ్రీకాంత్, ఐలయ్య, శ్రీను, జగన్ పాల్గొన్నారు.

నెల్లికుదురు: మాలోతు కవిత కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని జెడ్పీటీసీ సభ్యుడు మేకపోతుల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి నవీన్‌రావు ఓటర్లను కోరారు. మండలంలోని శ్రీరామగిరి, మునిగలవీడుతో పాటు వివిధ గ్రామాలల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు.

డోర్నకల్: మండలంలోని పెరుమాళ్ల సంకీస గ్రామ శివారు జరుగుతున్న ఉపాధి పనుల వద్ద సోమవారం మాలోతు కవితను గెలిపించాలని ఎంపీపీ ధరంసోత్ బాలునాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ తుమ్మ వెంకటరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి బిక్షంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కురవి: మండలంలోని రాజోలు గ్రామంలో కవిత గెలుపు కోసం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట లాలయ్య ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు షేక్ మస్తాన్, వీరేందర్, రాంమూర్తి, సత్యనారాయణ, నాగేశ్వర్‌రావు, ఉప్పలయ్య, యాదగిరి, సైదులు, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్: మాలోత్ కవితను గెలిపించాలని మండలంలోని ఇస్లావత్ తండా (ఎస్) గ్రామంలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోడ లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు.

చిన్నపాటి వర్షానికే రోడ్డు ఇలా..

చిన్నగూడూరు: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి కురిసిన వడగళ్ల వానకు అంతర్గత రోడ్లపై వరద నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. మండల కేంద్రంలోని ముదిరాజ్ బజార్‌లో సీసీ రోడ్డుపై వరద నీరు చేరి వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే రోడ్డుపై వరద నీరంతా చేరి మోకాళ్ల లోతు నీరు నిల్వ ఉంటోందని స్థానికులు వాపోతున్నారు. వర్షాకాలం రాకముందే ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డుపై వరద నీటిలో నడుస్తున్న వృద్ధురాలు

తల్లి కోసం కుమార్తె ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న కవిత కుమార్తె మహతి

మహబూబాబాద్ రూరల్: తన తల్లి, మహబూబాబాద్ పార్లమెంట్ నియోకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవితను మరోసారి అత్యధిక మెజార్టీతో ఎంపీగా గెలిపించాలని కోరుతూ కవిత కుమార్తె మాలోత్ మహతి మండలంలోని ఇస్లావత్ తండాలో సోమవారం ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి చేతులెత్తి నమస్కరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో లక్ష్మణ్ నాయక్, షాహిద, శశికుమార్, బానోత్ వెంకటేష్ పాల్గొన్నారు.

బుట్ట అల్లుతూ..



బుట్ట అల్లుతున్న అభ్యర్థి సుజాత

నెల్లికుదురు: బలహీన వర్గాల ప్రజల బతుకులు మారి రాజ్యాంగం రక్షణ కోసం బీఎస్పీ అభ్యర్థి ఏనుగు గుర్తుకు ఓటు వేసి ఎంపీగా గెలిపించాలని మహబూబాబాద్ బీఎస్పీ పార్లమెంట్ అభ్యర్థి కోనేటి సుజాత ఓటర్లను కోరారు. ఎన్నికల ప్రచారం మండలంలోని శ్రీరామగిరి, నెల్లికుదురు, ఎర్రబెల్లిగూడెం గ్రామాలల్లో సోమవారం బుట్టలు అల్లుతూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు శివరాజ్, ఉపేందర్, శ్రీను పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి

గార్ల: విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ ఎస్ఈ నరేష్ విద్యుత్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం మండలంలోని పోచారం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సబ్‌స్టేషన్‌లో ప్రతి నెల ఒక శనివారం మెయింటనెన్స్ కోసం మరమ్మతులు చేసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన ప్రాంతాల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎస్ఈ వెంట ఏఈ మహేంద్రబాబు, సిబ్బంది చారి, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడిగా ప్రసాద్



తొర్రూరు రూరల్: బీఎస్పీ పాలకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడిగా తొర్రూరు మండలంలోని గుర్తూరు గ్రామానికి చెందిన ఈదునూరి ప్రసాద్‌ను నియమిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు మడిపడిగ చంద్రశేఖర్ సోమవారం తెలిపాడు.

హోం ఓటింగ్



నర్సింహులపేట: మండలంలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వృద్ధులు, దివ్యాంగులకు ఎన్నికల కమిషన్ హోం ఓటింగ్ సదుపాయం కల్పించడంతో సోమవారం మండలంలో అధికారులు హోం ఓటింగ్‌ను నిర్వహించారు. మొత్తం 33 మందిలో 32 మంది ఓటింగ్‌ను ఇంటి వద్దనే ఎన్నికల అధికారుల సమక్షంలో వేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ శ్రీను, ఎన్నికల పీఓ, ఏపీఓ, సిబ్బంది, బీఎల్ఓలు పాల్గొన్నారు.

చిన్నగూడూరు: మండల వ్యాప్తంగా 47 మంది ఓటర్లకు గాను 44 మంది పోస్టల్ బ్యాలెట్‌లో ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తహసీల్దార్ మహబూబ్‌అలీ సోమవారం తెలిపారు.

కేసముద్రం: మండలంలోని ఆయా గ్రామాల్లో హోం ఓటింగ్ కార్యక్రమాన్ని ఎన్నికల అధికారులు సోమవారం నిర్వహించారు. మండలంలో మొత్తం 68 ఓట్లు ఉన్నట్లు తహసీల్దార్ దామోదర్ తెలిపారు.

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాలల్లో రెండు రోజులుగా నిర్వహించిన హోం ఓటింగ్ ప్రశాంతంగా ముగిసిందని తహసీల్దార్ రాజు తెలిపారు. 74 మందికి 70 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు.

నిరుపయోగంగా చేతిపంపు



కురవి: మండలంలోని నేరడ శివారు రాయినిపట్నం గ్రామంలోని బొడ్రాయి వద్ద ఉన్న చేతిపంపు నిరుపయోగంగా మారింది. వేసవి కాలంలో భగీరథ నీళ్లు రాని పక్షంలో ప్రత్యామ్నాయంగా ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకునేలా ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఈ చేతిపంపును ఉపయోగంలోకి తెస్తే గ్రామస్తులకు మంచి నీరు లభించే అవకాశాలుంటాయి. ఈ దిశలో స్థానిక అధికారులు ఆలోచించాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు కోరుతున్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించండి

నెహ్రూసెంటర్: బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పాయం చంద్రన్న ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్న బీజేపీ కూటమి, బీఆర్ఎస్‌లను ఓటు ద్వారా బుద్ధి చెప్పాలన్నారు. ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహిస్తూ బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించేందుకు గ్రామ గ్రామాన ప్రచారాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రవి, ప్రభాకర్, వీరన్న, వెంకటేశ్వర్లు, యాకయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాయం చంద్రన్న

మోకాళ్ల మురళీకృష్ణను గెలిపించాలి



బయ్యారం: ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న గోవర్ధన్

మహబూబాబాద్ రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మండల వెంకన్న అన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ న్యూడెమోక్రసీ అభ్యర్థి మోకాళ్ల మురళీకృష్ణ కుండ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరుతూ మండలంలోని కంబాలపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో సోమవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు బాబన్న, లింగ్యా, పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

నెల్లికుదురు: మోకాళ్ల మురళీ కృష్ణ కుండ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని సీపీఐ (ఎంల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు ఊడుగుల లింగన్న ఓటర్లను కోరారు. మండలంలోని భగ్యతండాలో సోమవారం ప్రచారం నిర్వహించారు.

నర్సింహులపేట: మోకాళ్ల మురళీకృష్ణను గెలిపించాలని మండల కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమాక్రసీ తొర్రూరు డివిజన్ కార్యదర్శి అలకుంట్ల సాయిలు ప్రచారం చేశారు.

బయ్యారం: ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాడే నాయకుడిని గెలిపించాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు గోవర్ధన్ పిలుపునిచ్చారు. మురళీకృష్ణకు మద్దతుగా సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఐలయ్య, వెంకటేశ్వర్లు, భిక్షం, నాగేశ్వరరావు, నర్సింహా, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

గార్ల: మోకాళ్ల మురళీకృష్ణను గెలిపించాలని న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని ఐలయ్య కోరారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి

● ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

నెల్లికుదురు: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మండల కేంద్రంతోపాటు మండలంలోని తారాసింగ్ బావి తండాలో స్థానిక నాయకులతో కలసి సోమవారం ఆయా గ్రామాల చెరువులల్లో నిర్వహిస్తున్న ఉపాధి హామీ కూలీల వద్ద పార్లమెంటు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మహిళకు సంవత్సరానికి రూ.లక్ష అందిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. మునిగలవీడు గ్రామానికి చెందిన గట్టు ప్రభాకర్ గౌడ్ 30మందితో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చెందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, నాయకులు యాదవరెడ్డి, సత్యపాల్ రెడ్డి, వెంకటేశ్వర్లు, లక్ష్మారెడ్డి, నాగరాజు, రత్నపురం యాకయ్య పాల్గొన్నారు.

చేతులెత్తి మొక్కుతున్నా.. ఓటెయ్యండి

గూడూరు: చేతులెత్తి మొక్కుతున్నా.. చేతిగుర్తుకు ఓటేసి బలరాంనాయక్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే మురళీనాయక్ ఓటర్లను అభ్యర్థించారు. మండలంలోని చిర్రకుంటతండాలో సోమవారం మాజీ సర్పంచ్ తాటి బుచ్చయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న, నాయకులు మాధవపెద్ది రమేష్‌చందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, హేమలతారెడ్డి, శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



గూడూరు: చిర్రకుంటతండాలో పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం: బలరాంనాయక్‌ను గెలిపించాలని కోరుతూ సోమవారం కేసముద్రంస్టేషన్, కాట్రపల్లి, ధన్నసరి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఇంటింటా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.

బయ్యారం: బలరాంనాయక్‌కు మద్దతుగా సోమవారం మండలంలోని కాచనపల్లి పంచాయతీలో కాంగ్రెస్ నాయకుడు రవి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రవి, శ్రీను, పాపయ్య, గోపాల్, కృష్ణ, తిరుమల్ పాల్గొన్నారు. బలరాంనాయక్ ను గెలిపించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మండా రాజన్న అన్నారు.

మహబూబాబాద్ రూరల్: సుస్థిర పాలన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఘణపురపు అంజయ్య అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపు కోరుతూ పట్టణంలోని 17, 18 వార్డుల పరిధిలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బానోత్ ప్రసాద్ నాయక్, రమేష్, రంజిత్, మొగిలి ప్రసాద్, మనోహర్, శ్రీనివాస్, భీమా నాయక్ పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కేసముద్రంలో..

గుడుంబా స్థావరాలపై దాడులు

మహబూబాబాద్ రూరల్: మండలంలోని బోడగుట్ట తండాలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించామని రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి సోమవారం తెలిపారు. ఈ దాడుల్లో 100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేయగా 20లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో రూరల్ ఏఎస్సై సూరయ్య, పీసీ బాలరాజు పాల్గొన్నారు.

గార్లలో..

గార్ల: గార్లలోని తహసీల్దార్ కార్యాలయం బజారుకు చెందిన ఓ మహిళ ఇంట్లో అక్రమంగా గుడుంబా విక్రయిస్తుంది. సమాచారం మేరకు సోమవారం పోలీసులు ఆమె ఇంట్లో సోదాలు నిర్వహించి 7 లీటర్ల కాపుసారా స్వాధీనం చేసుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీనత్‌కుమార్ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

సీతారాంనాయక్‌ను గెలిపించాలి



గార్ల: మహబూబాబాద్ పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్ గెలుపు కోరుతూ సోమవారం పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలంలోని సత్యనారాయణపురం, చిన్నకిష్టాపురం, పెద్దకిష్టాపురం, అంజనాపురం గ్రామాల్లో కమలం గుర్తుకు ఓటు వేయాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీను, దేవా, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో సాధారణ ప్రసవం

గూడూరు: మండలంలోని తీగలవేణి పీహెచ్‌సీలో సోమవారం స్టాఫ్ నర్స్ ఉదయశ్రీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఓ మహిళకు సాధారణ ప్రసవం చేశారు. ఈ విషయం తెల్సుకున్న ఆస్పత్రి డాక్టర్ రాంబాబు వెంటనే డీఎంహెచ్ఓకు సమాచారం అందించి సిబ్బందిని అభినందించారు. వెంటనే ప్రభుత్వం అందించిన పారితోషికం కిట్‌ను బాలింతకు అందించారు. కార్యక్రమంలో యునాని డాక్టర్ కిరణ్‌కుమార్, స్టాఫ్‌నర్స్ ఉదయశ్రీ, సూపర్‌వైజర్ షానుబేగం, సిబ్బంది పాల్గొన్నారు.

పంటల పరిశీలన

నర్సింహులపేట: ఈదురుగాలులు, అకాల వర్షంతో జరిగిన పంట నష్టంపై సోమవారం హార్టికల్చర్ అధికారి రాకేష్ పంటలను పరిశీలించారు. రామన్నగూడెంలో ఈదురు గాలులకు నేలమట్టమైన పొప్పడి తోటను పరిశీలించారు. అక్కడక్కడ నేలరాలిన మామిడిని పరిశీలించారు. నష్టంపై ఉన్నాతాధికారులకు నివేదికను పంపుతామని హెచ్ఓ తెలిపారు.

సాహు మహారాజ్ వర్ధంతి

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం రిజర్వేషన్ల పితామహుడు ఛత్రపతి సాహూ మహారాజ్ వర్ధంతి సందర్భంగా జిల్లా శాఖ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యుడు పార్నందిరామయ్య, బానోతు వీరు నాయక్, చాగంటి ప్రభాకర్, మాలోత్ భద్రు నాయక్, మద్దెల వీరస్వామి, మడే రామకృష్ణ, దాసరి మహేందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

మరిపెడ రూరల్: పిడుగు పాటుకు మరిపెడ మున్సిపాలిటీ 13 వార్డులో షేక్ ఉస్మాన్ పాషా కుటుంబానికి పెను ప్రమాదం తప్పి, తీవ్ర నష్టం వాటిల్లిన కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మరిపెడ మున్సిపాలిటీలోని బాధిత కుటుంబాన్ని సోమవారం నవీన్ పరామర్శించారు. వారికి పండ్లు అందజేసి వారిని ఓదార్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అచ్చుత్‌రావు, వెంకన్న, మహేందర్‌రెడ్డి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, కౌన్సిలర్ పరశురాములు పాల్గొన్నారు.

పార్టీలకు బుద్ధి చెబుతాం..

తొర్రూరు: రాజ్యాంగాన్ని మారుస్తామనే పార్టీలకు పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధిచెప్తామని మాల మహానాడు జిల్లా అధికార ప్రతినిధి చిట్టిమళ్ల మహేష్ అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలో మాల మహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బీజేపీని ఓడించాలన్నారు. కార్యక్రమంలో సంఘ డివిజన్ అధ్యక్షుడు గొడిశాల నవీన్, మండల అధ్యక్షుడు నగేష్ పాల్గొన్నారు.

ఘనంగా దుర్గామాత ప్రతిష్ఠాపన

కేసముద్రం: మండలంలోని రంగాపురం గ్రామంలో దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ఎమ్మెల్యే మురళీనాయక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాడె మోసిన ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు రూరల్: మండలంలోని గుర్తూరు గ్రామానికి చెందిన ఈదునూరి వీరయ్య అనే బీఆర్ఎస్ సీనియర్ నాయకుడి కుమారుడు సందీప్(26) బ్రెయిన్‌స్ట్రోక్‌తో మృతి చెందాడు. సోమవారం మాజీ మంత్రి దయాకర్‌రావు సందీప్ అంతిమయాత్రలో పాల్గొని పాడెమోసి, కన్నీటి పర్యంతమయ్యాడు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థికసాయం అందజేశాడు.

మూడోసారి బీజేపీ గెలుపు ఖాయం

తొర్రూరు: కేంద్రంలో మూడో పర్యాయం బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ అన్నారు. బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ గెలుపు కోరుతూ సోమవారం డివిజన్ కేంద్రంలోని పలు వార్డుల్లో పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈనెల 8న వరంగల్‌లో జరిగే మోదీ సభకు భారీగా తరలిరావాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్, నాయకులు రాయపురం రాజ్‌కుమార్, వినయ్‌శర్మ, కాగు నవీన్, సంతోష్, శివలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకొని ఆత్మహత్య

గార్ల: కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం ఖమ్మంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్లలోని పుట్టకోట బజారుకు చెందిన బండారి సంపత్(40) ఖమ్మంలో కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. చాలీచాలని జీతంతో కుటుంబాన్ని పోషించలేక ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాత్రి కుటుంబ సభ్యులు అందరూ కలిసి నిద్రపోయాక, పక్క గదిలోకి వెళ్లి ఉరి వేసుకొని చనిపోయాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు సంతానం. మృతదేహానికి ఖమ్మం ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం స్వగ్రామమైన గార్లకు మృతదేహాన్ని తీసుకొచ్చి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

ఎస్సారెస్పీ కాల్వలో పడి వృద్ధుడి..

కురవి: ఎస్సారెస్పీ కాల్వలో పడి వృద్ధుడు రాయల చినకోటయ్య(65) మృతి చెందిన సంఘటన మండలంలోని బలపాల గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. బలపాల గ్రామానికి చెందిన రాయల చినకోటయ్య మధ్యాహ్నం గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కాల్వలో ప్రమాదవశాత్తు పడిపోయి మృతి చెందాడు. కోటయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని కోసం వెతికారు. ఎస్సారెస్పీ కాల్వలో మృతదేహం ఉండడంతో గ్రామస్తులు వెళ్లి చూడగా కోటయ్యగా గుర్తించారు. మృతదేహాన్ని మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఇదే విషయమై కురవి ఎస్సై బి.గోపిని వివరణ కోరగా కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని తెలిపారు.

విద్యుదాఘాతంతో విలేకరి..

పెద్దవంగర: విద్యుదాఘాతంలో ఓ విలేకరి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని కొరిపెల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలప్రకారం గ్రామానికి చెందిన తాళ్లపల్లి నవీన్(36) ఓ దినపత్రికలో విలేకరిగా పనిచేస్తున్నాడు. తన ఇంట్లో ఉన్న వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేసి పైకి ఎక్కుతున్న క్రమంలో పేలిపోయిన విద్యుత్ తీగలు చేయికి తగిలాయి. విద్యుదాఘాతానికి గురై నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య స్వప్న, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధుడి..

నెల్లికుదురు: ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చింతకుంట్ల సోమయ్య (70) ఈనెల 5న సాయంత్రం స్నానం చేసేందుకు గ్రామ పరిధిలోని ఓ వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. స్నానం చేసే క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. కుమారుడు ఉపేందర్ ఎక్కడ వెతికినా ఆచూకీ కనిపించలేదన్నారు. సోమవారం మధ్యాహ్నం గ్రామ పరిధిలోని వ్యవసాయ బావిలో శవమై కనిపించినట్లు తెలిపాడు. మృతుడి కుమారుడు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నాడు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

గార్ల: అదనపు కట్నం తీసుకురావాలని భార్యను తరచూ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్న భర్తపై వరకట్నం వేధింపుల కేసు నమోదైన సంఘటన సోమవారం సర్వన్‌తండాలో చోటుచేసుకుంది. ఎస్సై జీనత్‌కుమార్ కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్ల మండలం సర్వన్‌తండాకు చెందిన మాలోత్ కల్యాణితో అదే గ్రామానికి చెందిన మాలోత్ వెంకట్రామ్‌తో 14 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కొన్నేళ్లపాటు వీరి కాపురం సజావుగానే సాగింది. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. భర్త ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. 2ఏళ్ల నుంచి వెంకట్రామ్ వేరే అమ్మాయితో అక్రమ సంబంధం పెట్టుకొని ఇంటికి రాత్రి సమయంలో ఆలస్యంగా వస్తున్నాడు. ఇదేమిటని భర్తను అడిగితే ఆమెను శారీరకంగా మానసికంగా వేధించడంతోపాటు, అదనపు కట్నం తీసుకరావాలని తరచూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. భర్త వేధింపులు తాళలేక భార్య స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు భర్త వెంకట్రామ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

కొత్తగూడ: మండలంలోని చింతగూడెం గ్రామానికి చెందిన కల్తి సారయ్య కొత్తగూడకు వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడిపోయాడు. సారయ్య కాలు విరగడంతోపాటు తలకు తీవ్ర గాయమైంది. ప్రయాణికులు ఇచ్చిన సమాచారం మేరకు 108 ద్వారా నర్సంపేట ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో ఆవుల మృతి



మహబూబాబాద్ రూరల్: మండలంలోని సాదుతండా గ్రామానికి చెందిన రైతు లాలావత్ గణేష్‌కు చెందిన రెండు ఆవులు గాలి దుమారానికి గ్రామ శివారులో తెగిపడిన విద్యుత్ తీగలకు తగిలి సోమవారం అక్కడికక్కడే మృతిచెందాయి. రైతుకు రూ.1.20 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది.

చిన్నముప్పారంలో రెండు పాడి గేదెలు

నెల్లికుదురు: మండంలోని చిన్నముప్పారం గ్రామానికి చెందిన నర్ర వెంకన్న, పెద్ద తండాకు చెందిన బానోతు బిక్యా పాడి గేదెలు సోమవారం మేత మేసుకుంటు తెగిపడిన విద్యుత్ తీగలకు తగిలి విద్యుత్ షాక్‌తో మృతి చెందాయి.